# విరహగీతం

ఎన్. హారిప్రియ



డాక్టర్ మనోజ్ఞ కన్సల్టింగ్ రూంలోకి రాగానే..... ఎదురు చూస్తూ కూర్చునున్న అమూల్య లేచి నిలబడి నమస్కరించింది. దాన్ని చిరునవ్వుతో స్వీకరించిన డాక్టర్ మనోజ్ఞ కుశల ప్రశ్నలడుగుతూ కూర్చుంది తన సీటులో.

ప్రముఖ బిజినెస్ మాగ్నెట్ విలాస్ భార్యగా అమూల్య డాక్టర్ మనోజ్ఞకు తెలుసు.

"చెప్పండి..... ఏమిటిలా వచ్చారు?" పలకరించింది.... డాక్టర్ మనోజ్ఞ.

చెప్పింది అమూల్య. చెప్తున్నప్పుడు అమూల్య వదనంలో దైన్యం, బాధ ప్రస్ఫుటంగా కనిపించాయి.

అమూల్య అందమైనది.... ఇంకా పేరున్న రచయిత్రి. తన చేతిలోని కలవిన్యాసంతో పాఠకలో కొన్ని ఉత్తేజ పరచి మనసులను రంజింపజేయగల రైటర్.

మనస్తత్వ శాస్త్రాన్ని ఆసాంతమూ అధ్యయనం చేసి విదేశాల్లో తర్ఫీదై ప్రముఖ సైకియాట్రిస్ట్‌గా పేరు పొందిన మనోజ్ఞ అమూల్యలో నిగూఢంగా దాగి బాధిస్తున్న మానసిక వేదననూ.... ఆమెలో చెలరేగుతున్న అంతఃస్సంఘర్షణనూ ఆమె మాటల ద్వారానే వెలికి తీయాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది.

అమూల్యకు విలాస్‌తో పెళ్లయి పదేళ్లు దాటుతోంది.... పిల్లలు లేరింకా.

"ఇంతకాలం.... పిల్లలు వద్దనుకున్నారా?"

"లేదు. కావాలనుకున్నా ప్రయోజనం లేదు." అమూల్య చెప్పిన సమాధానం మనోజ్ఞను ఆశ్చర్య చకితను చేసింది.

"అంటే?...."

అందుకు సమాధానంగా ఓ శుష్కహాసం చేసింది అమూల్య.

"ఐ మీన్..... నాకు సమాధానం కావాలి. ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి..... ఇదివరకు ఇద్దరూ టెస్ట్‌లు చేయించుకున్నారా? పాత రిపోర్ట్‌లు ఏం చెప్పాయి? అవి తెచ్చారా?"

"లేదు. అసలు ఏలాంటి టెస్ట్‌లు చేయించలేదు డాక్టర్. అది ఆయనకు ఇష్టం లేదు. అంత అవసరం కూడా ఉండదనుకుంటాను."

"మరి.... మీ ప్రస్తుత బాధేమిటి?"

మౌనంగా తలదించుకుంది.

"మీ సమస్యేమిటో తెలిస్తేనే గానీ నేనేమీ చెయ్యలేను. మీరు మౌనం వహిస్తే ఎలా?"

"డాక్టర్..... నా ప్రస్తుత సమస్య...."

"చెప్పండి మిసెస్... అమూల్య. సందేహిస్తారెందుకు?"

"నా మనసు వశం తప్పుతుందేమోనని, నా శరీరం అదుపు తప్పుతుందేమోనని..... నేను.... తప్పు చేస్తానేమోనని..... నాకే చాలా భయంగా ఉంటోంది....."

సైకాలజీలో డిప్లొమా పొందిన అంతటి మానసిక శాస్త్రవేత్త అదిరి పడింది! ఆమెకు నివ్వెరపాటుతో పాటు నోట మాట రాలేదు.

అమూల్యని..... ఒకసారి ఆసాంతమూ పరికించి చూసింది....

నాజూకు తనం సౌకుమార్యం, నిరాడంబరత.... కలబోసిన మంచి తనం.... అన్నిటినీ మించి...... మనసునూ, శరీరాన్నీ ప్రతిస్పందింపజేసి..... అనుభూతుల్ని పంచే పచ్చి వయసులో ఉంది. మనోజ్ఞ అడిగే ప్రశ్నలకు చాలా నెమ్మదిగా, అణకువగా సమాధానం చెప్తోంది.

"యూ..... మీన్....?"

"ఔను డాక్టర్ మనోజ్ఞా.... నేను చెప్పేది నిజం...."

"....మీ వారంటే... మీకు..... ఇష్టం లేదా? నాకు..... నిజం చెప్పండి." లో గొంతుకతో చనువుగా అడిగింది.

"నేను.... ఆయన్ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాను ఆయనకోసం నా ప్రాణాలైనా అర్పిస్తాను."

"అఫ్‌కోర్స్..... మరి.... మీ వారికి..... మీరంటే ఇష్టం లేదా?"

"ఆయనా నన్ను ప్రేమించే పెళ్లి చేసుకున్నారు.... అనుకున్నాను..... కానీ.... ఆల్కహాల్ ఒక్కటే ఆయన ఫేవరేట్ అని ఆ తరువాత తెలిసింది. నిజం చెప్పాలంటే.... ఆయన అను నిత్యం.... నిరంతరం కాపురం చేసేది.... నాతో కాదు..... దానితోనే."

మనోజ్ఞకు కేసు పూర్తిగా అర్థమైంది.

వైద్య పరంగా ఆల్కహాల్ ఎప్పుడైనా కొద్ది మోతాదులో అవసరమైనా అతి తాగుడు ఆరోగ్యాన్ని దెబ్బ తీయటమే కాకుండా... కోరికల్ని, వాంఛల్ని అణచి పెట్టి.... మనసునూ, శరీరాన్ని మత్తెక్కించి సుఖానుభవాలను సమాధి చేసి..... జీవితాలను నిస్సారం చేసి నిద్ర పుచ్చుతుందనేది నిస్సందేహం.....!

అలాంటి దుర్భరమైన పరిస్థితుల్లో కోరికలు చెలరేగే పచ్చి వయసులో ఉన్న అమూల్య భయపడటంలో తప్పేమీ లేదు.

దీనికంతటికీ ప్రధాన కారణం.... ఆమెలో ప్రవహించే..... అసంతృప్తి! ఆమె జీవితంలో ప్రవహిస్తున్న....ని'స్సారం'.....

అమూల్య రచనల్లో.... విశిష్ఠమైన సహజత్వం దొర్లుతూండే నిజమైన పాత్రలూ, అందమైన నందనోద్యానవనం లాంటి జీవితాలూ.... ఆ జీవితాల్లో స్రవించే మకరందం, మాధుర్యం రుచి చూపిస్తూ వుంటాయి. సజీవ పాత్రలుగా కళ్ల ముందు నిలుస్తాయి.

ఆమె రచనలు చదివే వారెవరైనా ఆమె జీవితం కూడా ఆమె రచనల్లాగానే ఆద్యంతమూ పూల తోటగా.... తీపి పాటగా ఉంటుందని అనుకుని తీరతారు. అంతే గాని.... ఎంతో అందంగా, హృద్యంగా జీవితాలను మలచి కలం నుండి రచనలను జాలువార్చే ఆమె నిజ జీవితంలో మకరందం, మాధుర్యం అనేవి శ్యూనమని, మనసులో పూడ్చలేని అఖాతం ఉందని.... నిరాశ, నిస్పృహలతో ఆమె తనువు, మనసు వేగిపోతోందని ఎవరూ ఊహించలేరు.

ఆ మాటే అడిగింది మనోజ్ఞ...

అమూల్య ఇచ్చిన సమాధానం ఆమెను ఆశ్చర్యచకితను చేసింది.

"..... వాస్తవాన్ని తట్టుకోలేక..... ఊహల్లో, కల్పనల్లో బ్రతుకుతున్నాను."

మనోజ్ఞ వెన్ను ఝెల్లున చరిచినట్లయి ఉలికిపడింది. ఆమె గ్రహించిందల్లా అమూల్యది ఒట్టి భయం మాత్రమే కాదు. భర్త విలాస్ మీద ఆమెకున్న అసమాన ప్రేమానురాగాలు ఆమెనలా పరితపించేలా చేస్తున్నాయన్న నిజం. అసంతృప్తి కరమైన దాంపత్య జీవితం గడపటం ఎంత దుర్భర నరకమో అమూల్య మాటల్లో వ్యక్తమవుతోంది.

ఈ విషయంలో మగాణ్ని స్వేచ్ఛా విహారిని చేసే సంఘసమాజాలే ఆడదాని విషయంలో కట్టుబాట్ల వల విసిరి సంఘ జీవిగా శాసించేస్తాయి.

మగాడి విషయంలో ఒక లోపాన్ని కొరతగా ఎత్తి చూపి మరో మార్గాన్ని సూచించి ప్రోత్సహించే సంఘ సమాజాలే..... ఆడదాని విషయం వచ్చే సరికి.... ఆ కొరతనే లోపాలుగా ఎత్తి చూపి..... దుమ్మెత్తి పోస్తాయి.

అమూల్య రచనలను ఆసక్తిగా చదివి మెచ్చుకునే మనోజ్ఞకు అమూల్య మనసు విషాదంగా ఆలపించే విరహ గీతం కూడా స్పష్టంగా వినిపిస్తోంది.

"విరహములో నేను.... వేగిన దాన...."

అమూల్య మౌన గీతంలోని మనోవేదనని అర్థం చేసుకుంది మనోజ్ఞ.....

ఆమె లైఫ్‌లో సాగుతోంది.... విషాద పర్వం....!

"ట్రీట్ మెంట్ ఇవ్వాల్సింది నీక్కాదు అమూల్యా..... మీవారికి. నేను విలాస్ గారితో మాట్లాడతాను." అంటూ పైకి లేచింది డాక్టర్ మనోజ్ఞ!!

